క్లుప్తంగా

అంకమ్మతల్లి శక్తి పీఠంలో నెల సంబరం



మధురానగర్(విజయవాడసెంట్రల్): నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తి పీఠంలో బుధవారం నెల సంబరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి డప్పువాయిద్యాల నడుమ అమ్మవారికి పొంగలి సమర్పించారు. అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, శ్రీచక్రార్చనలు నిర్వహించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు పర్యవేక్షించారు.

కనకదుర్గకు నివాళి

మధురానగర్(విజయవాడసెంట్రల్): 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి తల్లి జనార్దనపురం కనకదుర్గకు బుధవారం ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు నివాళులర్పించారు. గులాబీతోటలో బుధవారం కనకదుర్గ సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు పెనుమత్స శిరీష, బాలి గోవిందు, కొంగితల లక్ష్మీపతి కో ఆప్షన్ సభ్యురాలు గుండే సుభాషిణి, గుండే సుందర్‌పాల్, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

శభాష్ వర్ధిని



విజయవాడస్పోర్ట్స్: ఆడుదాం ఆంధ్రా మహిళల క్రికెట్ పోటీల్లో అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించి చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) టాలెంటెడ్ ప్లేయర్‌గా సెలక్ట్ అయిన విజయవాడ క్రీడాకారిణి కె.వై.ఎం.విష్ణువర్ధినిని నలంద డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.అనురాధ బుధవారం కాలేజీ ప్రాంగణంలో అభినందించారు. ఆడుదాం ఆంధ్రా క్రికెట్ రాష్ట్ర పోటీలకు తమ కళాశాల నుంచి వర్ధినితో పాటు మరో విద్యార్థిని పూజిత ఎన్టీఆర్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించినట్లు చెప్పారు. మొదటి సంవత్సరం డిగ్రీ(బీకాం) చదువుతున్న వర్ధిని రాష్ట్ర జట్టుకు విన్నర్ ట్రోఫీని అందించడంలో కీలకంగా వ్యవహరించడం సంతోషంగా ఉందన్నారు. టాలెంట్ హంట్‌లో భాగంగా సీఎస్‌కే నిర్దేతల టాలెంటెడ్ జాబితాలో పేరు సాధించి, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులు పొందడం అభినందనీయమన్నారు. క్రీడా నైపుణ్యాలను మెరుగుపర్చుకుని వర్ధిని రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

బొండా వ్యాఖ్యలు సిగ్గుచేటు

మాజీ డెప్యూటీ మేయర్ గోగుల రమణారావు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి వచ్చేందుకు బొండా ఉమా వైఎస్సార్ సీపీలో కొంతమంది పెద్దల కాళ్లు పట్టుకున్నాడని... అటువంటి వ్యక్తి ఇప్పుడు విజయవాడ ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్‌పై నోటికొచ్చినట్లు మాట్లాడడం సిగ్గుచేటని మాజీ డెప్యూటీ మేయర్, వైఎస్సార్ సీపీ నాయకుడు గోగుల రమణారావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సెంట్రల్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన బొండా ఉమాపై నిప్పులు చెరిగారు. బొండా ఉమ ఒక పెద్ద అవినీతిపరుడని, చేతిలో అధికారం పెట్టుకొని కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దండుకున్నాడని విమర్శించారు. 2021 కార్పొరేషన్ ఎన్నికల్లో కార్పొరేటర్ సీట్ల కోసం ఒక్కొక్కరి దగ్గర నుంచి 10 లక్షల వరకూ వసూలు చేశాడని ఆరోపించారు. నోటికొచ్చినట్లు మాట్లాడితే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కమ్మిలి రత్నకుమార్, ఒగ్గు గవాస్కర్, ఎండీ హఫీజుల్లా, షేక్ అమిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా జగనన్న పాలన కోరుకుంటున్నారు

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు



స్థానిక సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వెలంపల్లి శ్రీనివాసరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజలంతా జగనన్న పాలన కోరుకుంటున్నారని రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేయటానికి సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మాజీ మంత్రి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 29వ డివిజన్ మధురానగర్ సాయిబాబా కాలనీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. స్థానిక సమస్యలు స్వయంగా అడిగి తెలుసుకోవటంతో పాటు ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ప్రజలతో కలిసిపోయి వారి సమస్యలు విన్నారు. డివిజన్‌లో దోమలు అధికంగా ఉన్నాయని స్థానికులు ఫిర్యాదు చేయగా వెంటనే అధికారులతో మాట్లాడి దోమల నివారణ చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే మురుగు కాలువలను శుభ్రం చేసి దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైల్వే స్థలంలో చెత్తచెదారం పేరుకుపోవటం వల్లే దోమలు పెరుగుతున్నాయని కావున రైల్వే అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మధురానగర్‌లో ఆర్‌యూబీ పనులను నెల రోజులలోపు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అవ్వాతాతలు హారతలు ఇస్తూ ఘన స్వాగతం పలికారు.

లోకేశ్‌కు జగనన్న పేరు ఎత్తే అర్హత లేదు...

కనీసం మంగళగిరిలో ఎమ్మెల్యేగా కూడా గెలవలేని లోకేష్‌కు 151 ఎమ్మెల్యే, 23 ఎంపీలతో పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు ఎత్తే అర్హత లేదని వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు, లోకేష్‌తో పాటు పవన్ కల్యాణ్ కూడా ఓటమి చెందటం ఖాయం అన్నారు. దీంతో ఏంచేయాలతో పాలుపోక లోకేష్ నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ఎవరూ పోటీకాదని తాము ప్రజల సహకారంతో ఎన్నికలలో క్లీన్ స్వీప్ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కంభం కొండలరావు, క్రిస్టియన్ మైనార్టీ జిల్లా చైర్మన్ బందెల దయానందం నాయకులు ఎస్‌కే బాబు, పోలుకొండ శ్రీనివాసరావు, ఎస్‌కే అక్బర్, గోవిందు, పాలకోటి దుర్గాదేవి పాల్గొన్నారు.

తుదిదశలో అమ్మవారి రంగుల ఉత్సవం

ఈనెల 18న పెనుగంచిప్రోలుకు పయనం



రంగులు పూర్తి చేసుకున్న గోపయ్య సమేత తిరుపతమ్మ, సహదేవతల విగ్రహాలు

జగ్గయ్యపేట: పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసియున్న గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారుతో పాటు సహదేవతల విగ్రహాలకు రంగులు దిద్దే ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. ఈనెల ఒకటో తేదీన అమ్మవారితోపాటు సహదేవతల విగ్రహాలు రంగుల మహోత్సవానికి జగ్గయ్యపేటకు తీసుకువచ్చారు. పట్టణంలోని దస్తావేజుల సెంటరులోని మంటపంలో ఆచారం ప్రకారం గాజర్ల వంశీయులు రంగులు దిద్దుతున్నారు. మూలవిరాట్ తిరుపతమ్మ, గోపయ్య విగ్రహాలతో పాటు ఉత్సవ విగ్రహాలు తిరుపతమ్మ, గోపయ్యలతోపాటు మల్లయ్య, చంద్రమ్మ, మద్దిరావమ్మ, వినుకొండ అంకమ్మ, ఉన్నవూరు అంకమ్మ విగ్రహాలకు రంగులు దిద్దటం పూర్తయింది. పెద్దమ్మవారు, గుర్రం విగ్రహాలకు రంగులు దిద్దడం గురువారంతో పూర్తవుతుందని వంశీయులు భాస్కరరావు తెలిపారు. రంగులు పూర్తిచేసుకుని అమ్మవారితో పాటు సహదేవతల విగ్రహాలు ఈనెల 18న జగ్గయ్యపేట నుంచి పెనుగంచిప్రోలుకు పల్లకిలో వెళ్లనున్నాయి. మరో మూడురోజుల్లో అమ్మవారు పయనం ఉండటంతో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు.

వైభవంగా విద్యా సరస్వతి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



శ్రీసరస్వతి అమ్మవారు



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న గ్రామస్తులు

పెనమలూరు: గంగూరు గ్రామ పరిధి విజయ్ స్పిన్నింగ్ మిల్ ప్రాంగణంలో బుధవారం శ్రీ విద్యా సరస్వతి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. వసంత పంచమి సందర్భంగా నూతనంగా నిర్మాణం చేసిన శ్రీ విద్యా సరస్వతి అమ్మవారి ఆలయంలో బుధవారం ఉదయం 10.15 గంటలకు శ్రీ సరస్వతి అమ్మవారి విగ్రహాన్ని, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. దేవతి హోమం, పూర్ణాహుతి, శాంతికల్యాణం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు



మాట్లాడుతున్న చైర్మన్ భరద్వాజ్

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చైర్మన్ భరద్వాజ్ తెలిపారు. ఆలయ ధర్మకర్త పాలక మండలి తొలి సమావేశం ఆయన అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండ చుట్టూ గిరిప్రదక్షిణ కోసం పనులు పూర్తవుతున్నాయన్నారు. కోనేరు అభివృద్ధి, ఆర్చి గేటు నిర్మాణాలు, భక్తుల సౌకర్యార్థం లిఫ్ట్, స్వామి వారి ప్రచారానికి దాతల సహకారంతో రథం ఏర్పాటు తదితర అభివృద్ధి పనులతోపాటు సిబ్బంది వేతనాల పెంపునకు తగిన చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు. ఏసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు, పాలకవర్గ సభ్యులు రాంబాబు, వెంకటేశ్వర్లు, నరసింహారావు, రమాదేవి, ప్రధానార్చకుడు రామకృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ పీటలపై కూర్చునే దంపతుల ఎంపిక



లాటరీలో పాల్గొన్న ఆలయ చైర్మన్

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని పీటలపై కూర్చునే దంపతులను బుధవారం ఆలయ ప్రాంగణంలో లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఈ నెల 23న నిర్వహించే కల్యాణంలో శ్రీతిరుపతమ్మవారి తరుపున ఆమె ఇంటి పేరు గల కొల్లా వారి తరుపున కొల్లా రఘురామయ్య దంపతులు ఒక్కరే దరఖాస్తు చేసుకోగా వారు ఎంపికయ్యారు. అమ్మవారి భర్త శ్రీగోపయ్యస్వామి తరుపున కాకాని ఇంటిపేరు తరుపున ఏడుగురు దరఖాస్తు చేసుకోగా, లాటరీ ద్వారా కాకాని కృష్ణమూర్తి దంపతులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు, పాలకవర్గ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళపై దౌర్జన్యం చేసిన వారిపై కేసు నమోదు

పెనమలూరు: మహిళపై దౌర్జన్యం చేసిన పలువురు వ్యక్తులపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరులో గ్రామంలో జి.పద్మజ గ్రూప్‌హౌస్‌లో నివాసం ఉంటుంది. అదే గ్రూప్‌హౌస్‌లో ఉంటున్న చందు రాజేశ్వరరావు, రూప, జగదీష్‌తో పాటు మరి కొందరు వ్యక్తులు పాత గొడవల కారణంగా పద్మజ, ఆమె కుటుంబ సభ్యులపై దౌర్జన్యం చేశారు. ఈ ఘటనపై బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు 32వ డివిజన్‌లో పాదయాత్ర

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా తలపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం 32వ డివిజన్ అయోధ్యనగర్ గంగానమ్మ గుడి వద్ద నుంచి ప్రారంభమవుతుందని వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్‌పాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కో ఆప్షన్ సభ్యురాలు గుండే సుభాషిణి తదితరులతో కలిసి గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించటంతో పాటు సమస్యలు స్వయంగా తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం



పాయకాపురం(విజయవాడరూరల్): వసంత పంచమి సందర్భంగా బుధవారం రాజీవ్‌నగర్‌లోని మాస్టర్ మైండ్స్ స్కూల్లో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం జరిగింది. పి.మణికంఠ పూజాకార్యక్రమంలో పాల్గొని చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. డైరెక్టర్ పి.అనిల్ కుమార్ అమ్మవారి దీవెనలు చిన్నారులకు ఉండాలని ఆకాంక్షించారు. తొలుత సరస్వతీదేవి చిత్ర పటం వద్ద పూజలు నిర్వహించారు.

రోటరీ డిస్ట్రిక్ట్‌కు రూ.1.98 కోట్ల సీఎస్ఆర్ ఫండ్స్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ (3020) గవర్నర్ రావూరి సుబ్బారావు (దత్త) ఆధ్వర్యంలో విజయవాడలోని రోటరీ సంస్థలకు రూ.1.98 కోట్ల సీఎస్ఆర్ ఫండ్స్ రావటం అభినందనీయమని రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ అధ్యక్షుడు బాయన బాబూజీ (బాబ్జీ) ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంత పెద్ద మొత్తం సీఎస్ఆర్ నుంచి రావటం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఆ నిధులతో రోటరీ డిస్ట్రిక్ట్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు అవకాశం కలిగిందని తెలిపారు. రోటరీ ఈస్ట్ పరిధిలోనూ నిర్విరామంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని వివరించారు.

20న వేంకటేశ్వరస్వామి కల్యాణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో ఈ నెల 20వ తేదీ మంగళవారం భీష్మ ఏకాదశి ని పురస్కరించుకుని ధర్మపరిషత్ మహా సంస్థానమ్ ఆధ్వర్యాన శ్రీదేవీ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 5 గంటలకు స్వామివారికి విశేషంగా అభిషేకం, ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. సాయంత్రం స్వామివారి కల్యాణం వేదపండితులచే నిర్వహిస్తామన్నారు. భక్తులు స్వామివారి కళ్యాణ ఉత్సవంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని సీతారామపురం కొత్త వెంకటేశ్వరస్వామి ఆలయం ఎదురువీధిలో ఈనెల 7వ తేదీన నడిరోడ్డుపై హత్యాయత్నానికి గురైన గిద్దా సత్యశ్రీ(36) విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు ఎస్ఐ ఎం.సూర్యభగవాన్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు..వారంరోజులుగా విజయవాడలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సత్యశ్రీ ఆరోగ్యం విషమించడంతో ఆమె మృతిచెందినట్లు ఆయన వివరించారు. ఆమెపై హత్యాయత్నానికి పాల్పడిన ముద్దాయి సయ్యద్ జాన్‌సైదాను ఈనెల 13వ తేదీన అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన విషయం విదితమే.

వ్యాన్‌లో తరలిస్తున్న 12 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

కంకిపాడు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని కంకిపాడు పోలీసులు మంగళవారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు... పునాదిపాడు ఫ్లై ఓవర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ వ్యాన్‌లో బియ్యం గుర్తించారు. వాటిని పరిశీలించగా రేషన్ బియ్యంగా తేలింది. దీంతో వాహనంలో తరలిస్తున్న 12 క్వింటాళ్ల రేషన్ బియ్యం, వ్యాన్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి



సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డాక్టర్ మాచర్ల సుహాసిని



సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీఎంసీ సీఈ ప్రభాకర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య అందించిన సేవలు ఎనలేనివని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో బుధవారం దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రిగా పనిచేసి బడుగు బలహీన వర్గాలకు ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. వృద్ధులకు పెన్షన్లు, దేశంలోనే బాలికలకు తొలిసారిగా సాంకేతిక విద్యను అందుబాటులోకి తెచ్చారని, దాంతో పాటు చర్మ కారులకు లిడ్‌క్యాప్ సంస్థ ఏర్పాటు, పారిశ్రామిక అభివృద్ధి దిశగా ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ అభివృద్ధి కార్పొరేషన్ ఏర్పాటు వంటి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అమృత, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇందుమతి, డీపీఎంఓ డాక్టర్ నవీన్, డాక్టర్ పద్మావతి, డాక్టర్ కార్తీక్, డాక్టర్ విద్యాసాగర్ , డెప్యూటీ డెమో ప్రభాకరరెడ్డి, ప్రసూనాంబ తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు దామోదరం సంజీవయ్య

పటమట(విజయవాడతూర్పు): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రెండో ముఖ్యమంత్రిగా, తొలి దళిత ముఖ్యమంత్రిగా ప్రజలకు సేవ చేసిన దామోదరం సంజీవయ్య చిరస్మరణీయుడని నగర పాలక సంస్థ చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం సంజీవయ్య జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రభాకర్ సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంజీవయ్య 1961లో విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి శంకుస్థాపన చేశారన్నారు. ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ బి.శ్రీనివాసరావుతో పాటు కార్పొరేషన్ సిబ్బంది అందరూ పాల్గొని ఘన నివాళులర్పించారు.

అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలి

బాబా మందిరంలో వసంత పంచమి వేడుకలు



పూజలు చేస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ లభించాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్, బాబా మందిరం గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి తెలిపారు. వసంత పంచమి పురస్కరించుకుని ముత్యాలంపాడు షిరిడీ సాయి బాబా మందిరంలో బుధవారం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన శ్రీ లక్ష్మి అష్టోత్తర పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక కళ్యాణార్థం పారాయణం నిర్వహిస్తున్న పారాయణమండలి కన్వీనర్ మందలపర్తి సత్యశ్రీహరిని అభినందించారు. ఉదయం 9 గంటల నుంచి 108 పర్యాయములు పారాయణం చేశారు. భక్తులకు పసుపు, కుంకుమ, గాజులు, చలిమిడి క్షీరాన్న ప్రసాదము, రవికెల వస్త్రము అందజేశారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను పారాయణమండలి కన్వీనర్ మందలపర్తి సత్య శ్రీహరి పర్యవేక్షించారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు



సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న పసుమర్తి కామేశ్వర శర్మ

మధురానగర్(విజయవాడసెంట్రల్): వసంత పంచమి పురస్కరించుకుని బుధవారం సత్యనారాయణపురం శ్రీవిజ్ఞాన విహార పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు పసుమర్తి కామేశ్వర శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన వసంత పంచమి విశిష్టత గురించి వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ బీవీఎస్‌టీ సాయి మాట్లాడుతూ సరస్వతీదేవి కరుణాకటాక్షం విద్యార్థులకు లభించాలని ఏటా వసంత పంచమి వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తొలుత సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జేవీ షణత్ కృష్ణ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ సుమబిందు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని, రోజుకు రెండు సార్లు స్నానం చేయాలని ప్రముఖ చర్మ సౌందర్య చికిత్స నిపుణులు డాక్టర్ కె.సుమబిందు తెలిపారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని గురుకుల సాంఘిక సంక్షేమ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం చర్మసంరక్షణ – వ్యక్తిగత పరిశుభ్రతపై అవవగాహన కార్యక్రమం నిర్వహించారు. సుమబిందు ముఖ్య అతిథిగా పాల్గొని చర్మ సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థినులకు వసతిగృహాల్లో సాధారణంగా ఎదురయ్యే చర్మసమస్యలు, వాటి పరిష్కారాల గురించి వివరించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. అధ్యాపకులు అరుణ, లావణ్య, ధనలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.